




ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 23 సంచిక: 127 తిరుపతి తేది : శనివారం 29 ఆగస్టు 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS


# నేపాల్‌లో జల ప్రళయం..
# 547కి చేరిన మృతుల సంఖ్య

- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం
- నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం




2లో

## నేడు అరకులో సీఎం చంద్రబాబు పర్యటన..

- 'సంజీవని' ప్రాజెక్టుకు శ్రీకారం
- గన్నెల గ్రామంలో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం
- పర్యటనలో భాగంగా ప్రజావేదికలో పాల్గొని ప్రసంగించనున్న చంద్రబాబు

ఆంధ్రనాడు–అమరావతి, ఆగస్టు 28



ఆంధ్రప్రదేశ్‌లో మరో కీలక ప్రాజెక్టును ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు (శనివారం) అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించనున్నారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందించే లక్ష్యంతో రూపొందించిన 'సంజీవని' ప్రాజెక్టును ఆయన అరకులోయ మండలం గన్నెల గ్రామంలో ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం - మిగతా 2లో..



## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నాగబాబు

- మంగళగిరిలోని అరణ్యభవన్ లో బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ పదవి
- బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు అర్ధాంగి పద్మజ

ఆంధ్రనాడు–అమరావతి, ఆగస్టు 28

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల - మిగతా 2లో..

## వద్దూ..డ్రగ్స్ వద్దూ..! క్రీడలే.. ముద్దు

- తిరునగరిలో అమరావతి ఛాంపియన్ షిప్ 2026 విజేతల గంజాయి, డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ
- క్రీడలతోనే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం: శాప్ చైర్మన్
- గంజాయి అక్రమ రవాణా పై పిడి యాక్ట్ తిరుపతి జిల్లా ఎస్పీ

ఆంధ్రనాడు, తిరుపతి (ఎస్వీయూ) – ఆగస్టు 28:

యువతను మాదకద్రవ్యాలకు దూరం గా ఉంచి, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొం దించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం వైపు నడిపించాలనే లక్ష్యంతో తిరుపతిలో గంజాయి, డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని శాప్ చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో ఎస్వీయూ తారకరామా గ్రౌండ్స్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, దీనికి విరుగుడుగా క్రీడల పట్ల మొగ్గు చూపాలని యువతకు సూచించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గారు మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. యువత



గంజాయికి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రీడల వైపు మొగ్గు చూపాలని ఆయన అన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశాలపై ప్రత్యేక నిఘా, అక్రమ రవాణాను అరికట్టేందుకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్, డాగ్ స్క్వాడ్లను వినియోగిస్తున్నట్లు చెప్పారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన - మిగతా 2లో..



## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్న పవన్
- ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య

ఆంధ్రనాడు–అమరావతి, ఆగస్టు 28

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో - మిగతా 2లో..

## పదోసారి సవాల్ చేస్తున్నా..

### - డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ: నారా లోకేశ్

- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య

2లో

## డబ్బుతో గెలవాలని చూసేవారికి
# ఓటమి తప్పదు

- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం
- పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక



ఆంధ్రనాడు–అమరావతి, ఆగస్టు 28

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ - మిగతా 2లో..



## వ్యక్తిగత పర్యటనలో విషాదం..
## నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఉన్నతాధికారి గల్లంతు

కాట్మండు–అమరావతి, ఆగస్టు 28

నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న ఆకస్మిక వరదల్లో ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు చెందిన ఉన్నతాధికారి ఒకరు గల్లంతయ్యారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ అయిన 'ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్' హెడ్‌గా పనిచేస్తున్న లక్ష్ గోపిశెట్టి, వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్ వెళ్లారు. నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన వరదల తర్వాత ఆయన ఆచూకీ లభించడం లేదని ఇన్ఫోసిస్ నిన్న ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆయనను గుర్తించి, క్షేమంగా కాపాడటమే తమ కర్తవ్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇన్ఫోసిస్ స్పందిస్తూ.. - మిగతా 2లో..

# నేడు అరకులో సీఎం చంద్రబాబు పర్యటన..

(మొదటిపేజీ తరువాయి)

అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పర్యటన వివరాల ప్రకారం.. ముఖ్యమంత్రి ఉదయం 10 గంటలకు ఉండవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి గన్నెల గ్రామానికి చేరుకుంటారు. తొలుత గ్రామానికి సమీపంలోని రామకృష్ణానగర్‌లో ఓ గిరిజన కుటుంబాన్ని సందర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) 'సంజీవని' ప్రాజెక్టును ఆయన లాంఛనంగా ప్రారంభిస్తారు.

ఈ కార్యక్రమం అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన 'ప్రజావేదిక' బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. తర్వాత ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఈ పర్యటనలో భాగంగా పార్టీ కార్యకర్తలతోనూ సీఎం సమావేశం కానున్నారు. కార్యక్రమాలన్నీ ముగిసిన అనంతరం ఆయన తిరిగి హెలికాప్టర్‌లో నేరుగా ఉండవల్లికి బయలుదేరుతారు.

# డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు. పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019–24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నాగబాబు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

(మొదటిపేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## వ్యక్తిగత పర్యటనలో విషాదం..

# నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఉన్నతాధికారి గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)

"మా సహోద్యోగి లక్ష్ గోపిశెట్టి వ్యక్తిగత పర్యటనపై ఆ ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయి. ఆయన ఆచూకీని కనుగొనడానికి, కాంటాక్ట్ ఏర్పాటు చేయడానికి సంబంధిత ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉంటూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాము. లక్ష్ క్షేమంగా ఉండాలని, ఈ విషాదం బారిన పడిన వారందరూ సురక్షితంగా బయటపడాలని ప్రార్థిస్తున్నాము" అని పేర్కొంది. అమెరికా, కెనడాలోని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులపై ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది.మరోవైపు, ఈ వరదల తీవ్రతపై భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) కీలక వివరాలు వెల్లడించింది.

# వద్దూ..డ్రగ్స్ వద్దూ..! క్రీడలే.. ముద్దు





(మొదటిపేజీ తరువాయి)

సందర్భాల్లో పీడీ యాక్ట్ నమోదు చేసి చర్యలు చేపడుతున్నామని ఎస్పీ స్పష్టం చేశారు.

**ఆకట్టుకున్న విద్యార్థుల ఫ్లాష్‌మాబ్**

ర్యాలీ లో ఎస్ యు సాంస్కృతిక కోఆర్డినేటర్ డా. పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో విద్యార్థినిలు ప్రదర్శించిన యాంటీ డ్రగ్స్ ఫ్లాష్‌మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, యువత క్రీడలు, విద్య వైపు అడుగులు వేయాలనే సందేశాన్ని విద్యార్థులు తమ ప్రదర్శన ద్వారా చాటిచెప్పారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ క్రీడాకారులు, విద్యార్థులు, యువతతో యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శాప్ ఎండీ శ్రీమతి ఎస్. భరణి, ఐఎఫ్ఎస్, ఎన్.ఎన్.ఎస్ కోఆర్డినేటర్ డా పాకనాటి హరికృష్ణ, పద్మావతి మహిళా యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదోసారి సవాల్ చేస్తున్నా..

## - డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ: నారా లోకేశ్

- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య

**ఆంధ్రనాడు– ఒంగోలు, ఆగస్టు 28**

"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

**డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు**

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్–1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

**స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

**మరో మూడుసార్లు గెలవాలి**

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు. తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

**జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి**

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

# నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం
- నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం

**కాట్మండు–అమరావతి, ఆగస్టు 28**

నేపాల్–టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు–రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు. ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# రేషన్ డీలర్లకు పనికి తగ్గ కమిషన్ ఇవ్వాలి



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, ఆగస్టు 28 :**రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘ నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామ్మూర్తి కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న కమిషన్ ను రూపాయి నుంచి మూడు రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే బియ్యం బస్తాలను తూకం వేసి, క్లియర్ కోడ్ స్కానింగ్ అనంతరం రేషన్ దుకాణాలకు పంపించాలని కోరుతూ తహసీల్దార్ కు డీలర్ల సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ ల సంఘం సభ్యులు ప్రకాష్ కుమార్, గంగప్ప, కరుణ ధర్మ, నాగరాజ, మునిరాజ, సురేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెద్దపంజాణి, ఆంధరనాడు, ఆగస్టు 28 :** పుంగనూరులోని 132/33కేవి సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 వరకు మండలంలో వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా ఉండదని పెద్దపంజాణి విద్యుత్ శాఖ ఏఈ వెంకటరమణ తెలిపారు. మరమ్మతు అనంతరం మూడు గంటల నుంచి అన్ని ఫీడర్లకు వ్యవసాయ విద్యుత్తును అందిస్తామని తెలిపారు. రైతులు ఈ విషయం అర్థం చేసుకుని అధికారులకు సహకరించగలరని కోరారు.

# పని కోరిన ప్రతి కుటుంబానికి వేతన ఉపాధి : ఎంపీడీవో బాలాజీ



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, ఆగస్టు 28 :**పని కోరిన ప్రతి కుటుంబానికి వీబీజీ రామ్ జీ పథకం కింద వేతన ఉపాధి కల్పిస్తున్నట్లు ఎంపీడీవో కేఎన్ బాలాజీ అన్నారు. శుక్రవారం కోగిలేరు, రాయలపేట, వీరపల్లి గ్రామపంచాయతీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేతన దారులతో మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితి నెలకొన్నాయని, వ్యవసాయ పనులు మందగించడం వలన వీబీజీ రాంజీ పనులు విరివిగా ఉపయోగించుకోవాలన్నారు. ప్రస్తుతం రోజు వారి వేతనం 312 రూపాయల చెల్లించడం జరుగుతుందని సంవత్సరంలో పని కోరిన ప్రతి కుటుంబానికి 125 రోజులు వేతన ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. రాఖీ పండుగను పురస్కరించుకొని వీరప్పల్లిలో వేతన దారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సాంకేతిక సహాయకులు సత్యనారాయణ, క్షేత్ర సహాయకులు భార్గవి, చందు, జయప్రద వీరప్పల్లి స్థానిక ఎంపీటీసీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# నిరసన దీక్షలకు అనుమతి ఇవ్వండి



**ఆంధ్రనాడు, రేణిగుంట. ఆగస్టు 28 :**మద్యం షాపులకు వ్యతిరేకంగా వీధి నిరసన కార్యక్రమానికి అనుమతులు ఇవ్వాలని రేణిగుంట పోలీసులకు సిపిఎం పార్టీ మహిళా మండలి నాయకురాలు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.రేణిగుంట పట్టణంలో నూతనంగా పెట్టిన ఆధ్యా వైన్ షాప్, సర్వేశ్ వైన్ షాప్ లను తక్షణమే తొలగించి ఊరు బయటకు తరలించాలని రేణిగుంట సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో గత నెల రోజులుగా మద్యం షాపులను తొలగించాలని జిల్లా కలెక్టర్ కు, జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్పీకి, మండల తాసిల్దార్ కు, రేణిగుంట అర్బన్ సిఐ కు, డీఎస్పీ కి, దశల వారిగా ప్రజల సంతకాలతో వినతి పత్రాలు స్థానిక మహిళలు ఇచ్చినా కూడా అధికారులు, ప్రభుత్వం నుండి స్పందన లేదని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పోరాటాలకు కాకుండా రేణిగుంటలో కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ ప్రచారానికి అనుమతిస్తారా అని సూటిగా ప్రశ్నించారు. రేణిగుంట పట్టణంలో మద్యం షాపులు తొలగించాలని ఐద్వా మహిళా సంఘం చేపట్టే ఏ పోరాటానికైనా, రేణిగుంట సిపిఎం పార్టీ అండగా నిలబడుతుందని శుక్రవారం నాడు పత్రిక ప్రకటన ద్వారా సిపిఎం నేత కొండ్రెడ్డి హరినాథ్ తెలిపారు.

# అపోలో ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన ర్యాలీ



**చిత్తూరు, ఆంధ్రనాడు, అగస్టు 28:** జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(ఎఐఎంఎస్ఆర్) – చిత్తూరు జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి అపోలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ బి.జి. జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గత ఏడాది నవంబర్లో కార్నియా రిట్రీవల్ సెంటర్ను ప్రారంభించామని తెలిపారు. ఎల్.వి. ప్రసాద్ ఐ ఆసుపత్రి సహకారంతో ఈ సెంటర్ 24 గంటలు సేవలు అందిస్తోందని చెప్పారు. అలాగే ఆసుపత్రిలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం పై అవగాహన కల్పిస్తున్నామని, వయస్సుతో సంబంధం లేకుండా ఆరోగ్యకరమైన కళ్లను దానం చేయవచ్చని వివరించారు. ఇప్పటివరకు 125 మంది నేత్రదానం చేసినట్లు తెలిపారు. సేకరించిన కళ్లను అత్యాధునిక సాంకేతికతతో భద్రపరచి ఎల్.వి. ప్రసాద్ ఐ ఆసుపత్రికి పంపిస్తున్నామని, ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరి నుంచి ఐదుగురి వరకు చూపు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పిసిబి స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి. సునీల్ కుమార్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ, ఒక మనిషి మరణించిన తర్వాత కూడా తన కళ్ల ద్వారా మరో ఇద్దరికి చూపును అందించవచ్చని, చిన్న సంకల్పం రెండు జీవితాల్లో వెలుగు నింపుతుందని చెప్పారు. నేత్రదానం మహాదానం అని, ఇది అంధత్వంతో బాధపడుతున్న వారికి కొత్త ఆశ కలిగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్హెచ్ ఏవో ఎన్. రామగోపాల్ రెడ్డి, ఏఐఎంఎస్ఆర్ ఆప్థాల్మాలజీ విభాగాధిపతి డా. కుమార్ అమృత్, అధ్యాపకులు, వైద్యులు, అపోలో నర్సింగ్ కాలేజీ విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. చిత్తూరు ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ గాంధీ రోడ్డుమీదుగా గాంధీ సర్కిల్ వరకు సాగింది. గాంధీ సర్కిల్లో మానవహారంగా ఏర్పడి నేత్రదానంపై అవగాహన కల్పించారు.

# రేషన్ షాపులో నూతన క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానం రద్దు చేయాలి

## - రేషన్ డీలర్ల ఆందోళన



**ఆంధ్రనాడు–చంద్రగిరి,ఆగస్టు 28:** రేషన్ షాపుల్లో కొత్తగా అమలుచేస్తున్న క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానంను రద్దు చేయాలని మండల రేషన్ షాపు డీలర్ల అసోసియేషన్ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ దివాకర్ కు వినతి పత్రం అందించారు.సెప్టెంబర్ నుంచి రేషన్ బియ్యం బస్తాలపై క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానం అమలు చేయడంపై రేషన్ డీలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి బస్తా రేషన్ షాపుకు దిగుమతి చేసే సమయంలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి స్టాక్లో నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు.బియ్యం పంపిణీ సమయంలో ప్రతి రెండు బస్తాలకు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఈ–పోస్లో నమోదు చేయాల్సి రావడంతో పని భారం పెరుగుతుందని తెలిపిన రేషన్ డీలర్లు. చాలామంది రేషన్ డీలర్ల వద్ద ఇప్పటికీ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు అందుబాటులో లేవని, దీంతో సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చంద్రగిరి మండలం పరిధిలోని గంగుడుపల్లి, భీమవరం,కొండరెడ్డి కండ్రిగ, ఇతర గ్రామాలలో నెట్వర్క్ లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు.మండల స్థాయి స్టాక్ పాయింట్లలోనే క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని అమలు చేయాలని డీలర్లు ప్రభుత్వాన్ని కోరారు.స్టాక్ పాయింట్లలో జరుగుతున్న బరువు,తరుగు తదితర సమస్యల వల్ల ఇప్పటికే ప్రతి నెల 100 నుంచి 300 కిలోల వరకు నష్టం వాటిల్లుతోందని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు.50 కిలోల బస్తాలుగా క్యూ ఆర్ కోడ్ నమోదు చేయడం ద్వారా స్టాక్ పాయింట్లలోని అవకతవకలకు రేషన్ డీలర్లను బాధ్యులను చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్త క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని పునఃసమీక్షించి,సమస్యలు పరిష్కరించే వరకు అమలు నిలిపివేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చంద్రగిరి రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్,సెక్రటరీ, కమిటీ సభ్యులు డీలర్లు పాల్గొన్నారు.

# సాగు నీటి ప్రాజెక్టుల విధ్వంసకుడు వై యస్ జగన్

## - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



**ఆంధ్రనాడు– శాంతిపురం,ఆగస్టు 28 :**

2024 ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయిన జగన్ రెడ్డి... ఇంకా బటన్లు నొక్కి నేను ప్రజలకు మేలు చేశాను అనే భ్రమలోనే బతుకుతున్నాడు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల అరాచకాలు, అకృత్యాలకు ప్రజలు 11 సీట్లు ఇచ్చారని జగన్ రెడ్డి మరిచిపోయినట్టు ఉన్నాడు.ఏప్రిల్ నెల నుంచి ఒక్క గోదావరి జలాలపై ఆధారపడిన రైతులు తప్ప మిగతా చోట్ల అంతర్ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులను అప్రమత్తం చేశాం.శ్రీశైలం, పోతిరెడ్డిపాడు పేర్లు చెప్పి రాయలసీమపై మొసలి కన్నీరు కారుస్తున్న జగన్, తన ఐదేళ్ల పాలనలో రాయలసీమకు ఎన్ని టీఎంసీల నీరు అందించారో జిల్లాల వారీగా లెక్క చెప్పాలి.రాయలసీమ ప్రాజెక్టులకు గానీ, రాష్ట్ర సాగునీటి నిర్వహణకు కానీ ఇది చేశామని జగన్ రెడ్డి పెట్టిన రెండు గంటల ప్రెస్ మీట్ లో చెప్పుకోలేక పోయాడు.రాయలసీమకు మనం ఏం చేయలేదని మీ పార్టీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డే ప్రకటించాడు.తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల్లో కూడా సాగునీటికి క్రమంగా వినియోగించుకుంటూ 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం.అందులో భాగంగానే కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా రోజూ 7 వేల క్యూసెక్కుల నీటిని అందిస్తున్నాం.శ్రీశైలం ద్వారా రాయలసీమ ప్రజలకు రోజుకు 11,500 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నాం. తుంగభద్ర ద్వారా 6 టీఎంసీల నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నాం.శ్రీశైలం ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం వినియోగించే నీరు తిరిగి నాగార్జున సాగర్ కే చేరుతుందనే బుద్ధి కూడా జగన్ కు లేకపోయింది.తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నా కూడా నీటిని పొదుపుగా వినియోగిస్తున్నాం.సాగునీటి ప్రాజెక్టుల గురించి, రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్ రెడ్డికి లేదు.ఐదేళ్లు సాగునీటి ప్రాజెక్టులను విధ్వంసం చేశావు. పోలవరం ధ్వంసం చేశావు. వెలిగొండ, రాయలసీమ ప్రాజెక్టులను పండబెట్టావు. ఇప్పుడు నీతులు చెబితే ప్రజలు నమ్మరు. జీఓ 365 తెచ్చి రాష్ట్రవ్యాప్తంగా 224 సాగునీటి ప్రాజెక్టుల పనులు రద్దు చేశావ్.రూ.12 లక్షల కోట్ల బడ్జెట్ లో కేవలం రూ.30 వేల కోట్లు ప్రాజెక్టులకు ఖర్చు చేశావు.వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం అంటూ ప్రజలను మోసం చేశావు.నేడు కూటమి ప్రభుత్వంలో రూ.27 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశాం.రాయలసీమలో రూ.13,500 కోట్లు ఖర్చు చేశాం.పోలవరం ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేశాం.హంద్రీనీవాకు రూ.3,870 కోట్లు ఖర్చు చేసి 55 టీఎంసీల నీటిని రాయలసీమ చివరి భూములకు తరలించాం. మరో రూ.3 వేల కోట్ల పనులు జరుగుతున్నాయి.రాయలసీమ రైతులపై ప్రేమ ఉంటే ఎందుకు డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని రద్దు చేశావ్ఎన్జీటీ అనుమతులు లేకున్నా ఎందుకు రాయలసీమ లిఫ్ట్ పేరుతో ప్రజా ధనం దోచుకున్నారు. రాయలసీమ ద్రోహి... సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసకుడు జగన్. రాష్ట్రంలో శరవేగంగా పూర్తవుతున్న సాగునీటి ప్రాజెక్టులపై జగన్ రెడ్డి నిత్యం విషం కక్కుతున్నాడు అని అన్నారు.

# రెస్కో అధికారుల కరెంటోళ్ల జనబాట కార్యక్రమం

**ఆంధ్రనాడు –శాంతిపురం,ఆగస్టు28:** కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో)ఆధ్వర్యంలో ""కరెంటోళ్ల జనాభాట " కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని బెండనకుప్పం గ్రామంలో నిర్వహించారూ. కార్యక్రమం లో భాగంగా గ్రామస్తులను కలిసి విద్యుత్ సరఫరా, విద్యుత్ బిల్లులు, మీటర్లు , ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకన్నారు.అలాగే, విద్యుత్ సమస్యలు, ఫిర్యాదులను నమోదు చేసేందుకు



1912 టోల్ఫ్రీ నంబర్పై గ్రామస్తులకు అవగాహన

కల్పించారూ. విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెస్కో ఎం డి సోమశేఖర్ , డైరెక్టర్లు అనసూయ , చలపతి , బసవరాజు , డి ఈ హిమ్మత్ సాగర్ , ఏ ఏ ఓ రెవెన్యూ గోపి, ఏ ఈ మునిరత్నం , గ్రామస్తులతో పాటు యూనిట్ ఇన్చార్జ్ లోకేష్ నవీన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌పై ప్రజల అభిప్రాయ సేకరణ

**- ప్రతి స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు**




**ఆంధ్రనాడు –తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 28:** పౌరుల ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనాన్ని మరింత పెంచే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల ప్రాంగణాల్లో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా పీజీఆర్ఎస్ (మీకోసం) క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని ఎస్‌జీఎస్‌డబ్ల్యూ శాఖ డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ ఐఎఫ్ఎస్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సర్క్యులర్ మెమో ఆర్సి.నెం.231/ 2026ఏడిఎంఎన్/ఈ–3397004 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత పౌరులు క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా తమ అభిప్రాయాన్ని నమోదు చేసేలా సిబ్బంది చురుగ్గా ప్రోత్సహించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార నాణ్యతపై ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాన్ని సేకరించేందుకు ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఎస్‌జీఎస్‌డబ్ల్యూ కార్యాలయంలో ఫిర్యాదుల నమోదు, అభిప్రాయ సేకరణ తదితర అంశాల్లో పౌరులకు సహాయం చేసేందుకు సంబంధిత సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. డీఎస్‌జీఎస్‌డబ్ల్యూఓలు తమ పరిధిలోని కార్యాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు, డబ్ల్యూడీపీఎస్‌లకు అవసరమైన సూచనలు జారీ చేసి ప్రక్రియ సక్రమంగా అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. అలాగే ఎంఎస్‌జీవోలు, యూఎస్‌డబ్ల్యూఓలు తమ పరిధిలోని అన్ని ఎస్‌జీఎస్‌డబ్ల్యూ కార్యాలయాల్లో ఉత్తర్వుల అమలును పర్య వేక్షించాలని స్పష్టం చేశారు. పౌరుల నుంచి ప్రత్యక్షంగా, సకాలంలో అభిప్రాయాలను స్వీకరించడం ద్వారా ప్రభుత్వ సేవల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశ్యమని డైరెక్టర్ తెలిపారు.

# మహిళలకు రూ.1,500 ఎప్పుడు ఇస్తారు సార్..?

**- మహిళ ప్రశ్నకు సమాధానం దాటవేసిన ఎమ్మెల్యే పార్థసారథి**



**ఆంధ్రనాడు – ఆదోని, ఆగస్టు 28:** ఆదోని నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే డా. పి.వి. పార్థసారథికి ఓ మహిళ నుంచి ఊహించని ప్రశ్న ఎదురైంది. దీంతో ఎమ్మెల్యే కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొన్నట్లు స్థానికంగా చర్చ జరిగింది. శుక్రవారం నిర్వహించిన 'ప్రజల కోసం మీ పార్థసారథి' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పార్థసారథి క్రాంతినగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అనుచరులతో కలిసి గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, స్థానిక అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఓ మహిళ ఎమ్మెల్యేను ఉద్దేశించి "మహిళలకు రూ.1,500 ఎప్పుడు ఇస్తారు సార్?" అని ప్రశ్నించారు. మహిళ ప్రశ్నకు ఎమ్మెల్యే నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో అక్కడ ఆసక్తికర పరిస్థితి నెలకొంది. అనంతరం ఎమ్మెల్యే ఆ అంశంపై స్పందించకుండా కార్యక్రమాన్ని కొనసాగించినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల్లో కొన్ని పథకాలను అమలు చేస్తుండగా, మిగిలిన హామీలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని మహిళలు, ప్రజలు కోరుతున్నారు. ప్రజల నుంచి నేరుగా ఎదురవుతున్న ఇలాంటి ప్రశ్నలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

# సీఎం చంద్రబాబు విజన్‌ను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో సీవీఏపీయూలే కీలకం

**- వార్షికోత్సవం సందర్భంగా వర్చువల్ సమీక్ష**

**- విజన్ యాక్షన్ ప్లాన్, పి-4, కేపీఐల పురోగతిపై సీఎం సమీక్ష**



**ఆంధ్రనాడు–పీలేరు,ఆగస్టు 28:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన విజన్‌ను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు (సీవీఏపీయూలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని స్పష్టమైంది. స్వర్ణ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా విజన్ యాక్షన్ ప్లాన్, పి–4, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ) పురోగతిపై శుక్రవారం ప్రత్యేక వర్చువల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వర్చువల్ సమీక్షలో పీలేరు నియోజకవర్గం నుంచి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ హెచ్.ఎన్.ఎస్. నారాయణరెడ్డి, ఆర్డీవో శ్రీమతి విజయలక్ష్మి, డీఎల్‌డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీవైఎస్‌వో, ఏఎస్‌వోలు, యంగ్ ప్రొఫెషనల్, సీవీఏపీయూ విజన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో విజన్ యాక్షన్ ప్లాన్ అమలు తీరు, పి–4 కింద గుర్తించిన 'బంగారు కుటుంబాల' పురోగతి, కేపీఐల సాధనపై అధికారులు సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు కార్యక్రమాల అమలు, పురోగతిని వేగవంతం చేయాల్సిన అంశాలపై కూడా చర్చించారు. సీఎం నిర్వహించిన వర్చువల్ సమీక్షలో పీలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి నారాయణరెడ్డి, ఆర్డీవో విజయలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శులుగా కెఆర్ శంకర్, టి.గోపాల్ ఏకగ్రీవ ఎన్నిక





**ఆంధ్రనాడు – తిరుపతి, ఆగస్టు 28 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆపీసగ్రీ రాష్ట్ర ఎన్నికలు రెండు రోజుల క్రితం ఏలూరు లో జరిగిన సందర్భంగా తిరుపతి పట్టణానికి చెందిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీకెఆర్ శంకర్, టి గోపాల్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. కె ఆర్ శంకర్ గారు 40 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిపార్ట్మెంట్లో ఉద్యోగ సంఘానికి రాష్ట్ర నాయకుడిగా విశిష్టమైన సేవలు అందించి రిటైర్డ్ తర్వాత గత పది సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్థాపనకు తిరుపతి కేంద్రంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి హితోధికంగా సేవ చేసి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ఎంతో సేవ చేస్తున్న సందర్భంగా వారిని రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర ఎన్నికల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నది అదేవిధంగా గత 40 సంవత్సరాలుగా విద్యార్థి నాయకుడి నుండి ఉపాధ్యాయ నాయకుడిగా బీసీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకుడిగా సామాజిక కార్యకర్తగా,వివిధ స్వచ్ఛంద సంస్థల్లో భాగస్వామ్యమై ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ రాయలసీమ జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆపీసగ్రీ విస్తరణకు ఇతోదికంగా కృషి చేసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘాన్ని స్థాపిస్తూ వేలాది మంది పెన్షనర్లకు వారి సమస్యలు పరిష్కారం చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులకు కొత్తగా పెన్షన్ చెల్లింపులో ఎలాంటి అవినీతి లేకుండా వందలాది మందికి నిత్యం సేవలు చేస్తూ రాష్ట్రస్థాయిలోనే అత్యుత్తమ నాయకుడిగా పేరుగాంచి అందరితో స్నేహంగా ఆత్మీయంగా మెలుగుతూ ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడిగా టి గోపాల్ ఎన్నిక కావడం తిరుపతి జిల్లాలోనే కాకుండా రాయలసీమ 8 జిల్లాలో పెన్షనర్ల సంఘం బలోపేతానికి విస్తరణకి ఎంతో కృషి చేయగలరని రాష్ట్ర నాయకత్వం గుర్తించి కె ఆర్ శంకర్ ని టి గోపాల్ ని రాష్ట్ర కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే కాకుండా తిరుపతి జిల్లా పెన్షన్ల సంఘం నాయకులు వివిధ స్వచ్ఛంద సంస్థల నాయకులు ఉద్యోగ సంఘాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు మరియు అమరావతి జేఏసీ తిరుపతి జిల్లా నాయకులు గోపాల్ ని కె ఆర్ శంకర్ ని అభినందించారు.

ఈ సందర్భంగా టి గోపాల్, కేఆర్ శంకర్ మాట్లాడుతూ వారిని రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర సంఘం నాయకులకు రాయలసీమ జిల్లాలోని ఎనిమిది జిల్లాల పెన్షన్ సంఘం నాయకులకు సీనియర్ నాయకులు రాష్ట్ర సహాధ్యక్షులు గురు రాజ రావుకి రాష్ట్ర ఉపాధ్యక్షులు టి జయరామ నాయుడు కి తిరుపతి జిల్లా కార్యవర్గానికి తిరుపతి నగర శాఖ కార్యవర్గానికి సభ్యులకి పేరుపేరునా కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# దివ్యాంగులకు అండగా ప్రభుత్వం





**ఆంధ్రనాడు–చిత్తూరు, ఆగస్టు 28:** దివ్యాంగులు స్వావలంబనతో జీవించేందుకు, తమ రోజువారీ అవసరాలను ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా తీర్చుకునేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో 59 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్, చుడా చైర్మన్ కటారి హేమలత, మున్సిపల్ డిప్యూటీ మాజీ మేయర్ రాజేష్, వికలాంగుల చైర్మన్ నారాయణస్వామి, సంబంధిత అధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు. మూడు చక్రాల స్కూటర్లు పొందిన దివ్యాంగులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ రోజువారీ అవసరాలు, ఉద్యోగం, వ్యాపారం, శిక్షణ, క్రీడా సాధన కోసం ఇకపై ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా వాహనం ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు.

వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ అంతర్జాతీయ క్రీడాకారుడు వేలు స్వామి మాట్లాడుతూ, తన క్రీడా సాధనకు, బయటకు వెళ్లేందుకు ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుందని, దివ్యాంగులకు వాహనాలు అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పలమనేరుకు చెందిన అరుణ మాట్లాడుతూ, ఇప్పటివరకు ఏ ప్రభుత్వ పథకం ద్వారా వస్తువును పొందలేదని, తొలిసారిగా దివ్యాంగురాలిగా తనకు సుమారు రూ.1.40 లక్షల విలువైన వాహనాన్ని ఉచితంగా అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాఖీ పండుగ సందర్భంగా ప్రభుత్వం తమను అన్నదమ్ములుగా భావించి అండగా నిలిచిందని కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు, వారి చలనశీలతను పెంపొందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్ధిదారులు అభినందించారు. తమ జీవితాల్లో ఈ వాహనాలు కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాయని ఆనందం వ్యక్తం చేశారు.

# నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఆదోని కుటుంబం సురక్షితం

**- అధికారులతో మాట్లాడి ప్రత్యేక చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే డా. పార్థసారథి వాల్మీకి**



**ఆంధ్రనాడు – ఆదోని, ఆగస్టు 28:** కైలాస యాత్రకు వెళ్లి నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా అక్కడ చిక్కుకుపోయిన ఆదోని వాసులు భాస్కర్ శాస్త్రి కుటుంబ సభ్యులు సురక్షితంగా స్వస్థలానికి బయలుదేరారు. నేపాల్‌లో వరదల కారణంగా భాస్కర్ శాస్త్రి కుటుంబ సభ్యులు చిక్కుకున్న విషయం తెలుసుకున్న ఆదోని ఎమ్మెల్యే డా. పి.వి. పార్థసారథి వాల్మీకి వారి కుటుంబ సభ్యులతో నిరంతరం సమన్వయం చేస్తూ పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం భాస్కర్ శాస్త్రి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి నేపాల్‌లో తమ కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డా. పి.వి. పార్థసారథి వాల్మీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న కిషోర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నేపాల్‌లో చిక్కుకున్న ఆదోని వాసులు భాస్కర్ శాస్త్రి కుటుంబ సభ్యులను సురక్షితంగా స్వస్థలానికి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారిని కోరారు. కుటుంబ సభ్యుల ప్రయాణం సురక్షితంగా పూర్తయ్యే వరకు అధి కారులతో నిరంతరం సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలిచి, వారి భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డా. పి.వి. పార్థసారథి వాల్మీకి పేర్కొన్నారు.

# ఘనంగా గాండ్ల కులస్థులచే జంధ్యాలు పండుగ మహోత్సవం



**ఆంధ్రనాడు–పలమనేరు,ఆగస్టు 28:** పలమనేరు పట్టణ గాండ్ల సంక్షేమ సేవా సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో శ్రావణమాసపు పవిత్ర జంధ్యాలు పండుగ (ఆవని ఆవిట్టం) జరుపుకొన్నారు. స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వరాలయం నందు నూతన జంధ్యాల ధారణ కార్యక్రమం మాజీ ఎంపిపి ఆర్. రాజేంద్రన్ ఆధ్వర్యంలో జరుగగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం జరిపారు.పట్టణ పాతపేట నందలి పెద్ద గాండ్ల వీధి వినాయకుని ఆలయం నుండి కులస్థులు అందరూ కలసి చిన్న గాండ్ల వీధి భజనగుడి, శ్రీపతి రావు వీధి, వేణుగోపాలస్వామి ఆలయశ్రీ,శ్రీ సత్య గంగమ్మ గుడి మీదుగా మేళతాళాలతో ఊరేగింపుగా శివాలయం చేరుకొన్నారు.ఆలయంలో జంధ్యాల ధారణ మహోత్సవమును పురోహితులు కిషోర్ నేతృ త్వంలో మంత్రోచ్చారణలు నడుమ సాంప్రదాయం ప్రకారం కొనసాగించారు. అనంతరం చక్కటి ప్రత్యేక బాక్స్ లలో ప్రసాద వితరణలు చేశారు.ఈ కార్యక్రమం నిర్వహించడంలో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక చలువ పందిళ్ళు వేసి ప్రతి ఒక్కరికీ అవసరమైన ఏర్పాట్లు చేసి నిర్వాహకులు కులస్థులచే మన్ననలు పొందారు.కార్యక్రమం నిర్వాహకులుగా ఆర్. అమరేంద్ర బాబు, టి.కె. షణ్ముగం, పి.కె.ఎం. సుబ్రహ్మణ్యం,కోదండ రామ్మయ్య,ఆర్. కె. రవి,ఎ. ఆర్. కుమార్, బాలు,జె.సి. రవి,కేశవులు, గణేష్, రాజేష్‌లు వ్యవహరించగా సుమారు 500మంది గాండ్ల కులస్థులు పాల్గొని తమ సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఐక్యతను చాటారు.

**పారదర్శకంగా జమా–– ఖర్చులు**

గత ఏడాది కాలంగా పట్టణ గాండ్ల సంక్షేమ సేవా సంఘం ద్వారా జరుపుతున్న ప్రతి సేవా, దైవ కార్యక్రమాలలో దాతలు చేత నగదు లేదా వస్తురూపేణా స్వీకరిస్తున్న దానికి కొన్ని గంటలు వ్యవధిలోనే పారదర్శకంగా నిర్వాహకులు జమా ––– ఖర్చులు చూపుతున్న విధానాన్ని కులసభ్యులు హర్షం వ్యక్తం చేస్తుండడం విశేషం.

## ప్రకృతి వైద్యంతో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

**- తిరుపతిలో 29, 30 తేదీల్లో ఆయుష్ శాఖ కార్యక్రమం**

**ఆంధ్రనాడు –తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 28:** ప్రకృతి వైద్యం ద్వారా ముందస్తు ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి, డిజిటల్ వెల్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆగస్టు 29, 30 తేదీల్లో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఆగస్టు 29న విద్యార్థులకు, 30న ఉద్యోగులు, ప్రకృతి వైద్యాన్ని అనుసరించే వారు, ఆరోగ్యంపై ఆసక్తి ఉన్న ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. 29న ఉదయం 9.45 గంటలకు ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డా. మంతెన సత్యనారాయణ రాజు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు ముందస్తు ఆరోగ్య సంరక్షణ, ప్రకృతి వైద్య విధానాలు, జీవనశైలిలో మార్పుల ద్వారా ఆరోగ్య పరిరక్షణ అంశాలపై డా. మంతెన సత్యనారాయణ రాజు అవగాహన కల్పిస్తారు. ఉదయం 11.30 గంటలకు డిజిటల్ వెల్‌నెస్ కోచ్ బాలా కిషోర్ డిజిటల్ యుగంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలు, డిజిటల్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ డీటాక్స్ అవసరంపై ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు 'ఆహారమే ఔషధం--వంటగదే వైద్యశాల' అనే అంశంపై డా. మంతెన సత్యనారాయణ రాజు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బాలా కిషోర్ ఆధ్వర్యంలో డిజిటల్ డీటాక్స్ సెషన్ నిర్వహించనున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రకృతి వైద్య అనుచరులు, ఆరోగ్యంపై ఆసక్తి ఉన్న ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## బోయకొండ గంగమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తా...

**- మాజీ చైర్మన్ ఎస్‌కెఆర్**



**ఆంధ్రనాడు – చౌడేపల్లి, ఆగస్టు 28 :** మండలంలోని దిగు పల్లి గ్రామపంచాయతీ కేంద్రంలో వెలసియుండు శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారిని శ్రావణ మాసం శుక్రవారం రాహుకాల సమయమున లోకమాత, జగజ్జనని, శ్రీ బోయకొండ గంగమ్మను బోయకొండ మాజీ చైర్మన్ ఎస్కె వెంకటరమణారెడ్డి గంగమ్మ ను దర్శించుకునీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపంలో వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోయకొండ గంగమ్మ ఆలయం మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని అమ్మవారి సేవ చేసుకునే భాగ్యం మరల కల్పిస్తే బోయకొండ గంగమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకుపోవడానికి కృత నిశ్చయంతో ఉన్నారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## బంగారు తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ అభయం



**ఆంధ్రనాడు –తిరుచానూరు, ఆగస్టు 28:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు (అలిమేలు మంగమ్మ) శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి పై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. శుక్రవారంలో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవర్లను వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకెళ్లి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించిన వైభవంగా ఉంజల సేవ నిర్వహించారు. అనంతరం బంగారు తిరుచ్చిపై కొలువు దీర్చి తిరుమాడా వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కర్పూర నీరాజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఆలయ ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో శ్రీ హరిరావు, సూపరింటెండెంట్లు రమేష్, సురేష్, ముని చంగల్రాయులు, ఇన్స్పెక్టర్ చలపతి, లక్ష్మీకాంత్ ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామికి అభిషేక పీఠం బహుకరణ



**ఆంధ్రనాడు – చౌడేపల్లి, ఆగస్టు 28:** చౌడేపల్లి పట్టణంలో వెలిసియుండు రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి దాత అభిషేక పీఠాన్ని బహుకరించారు శుక్రవారం స్థానిక ఆలయంలో ప్రధాన అర్చకుడు వశిష్టాచార్యులు నిర్వహణ గ్రామ పెద్దలు పిల్లారి జీవన్ ప్రకాష్ రాజన్న లకు చౌడేపల్లి కి చెందిన శబరి నాథ్ గుప్తా స్వామివారి తిరుమంజమునకు అవసరమయ్యే అభిషేక పీఠాన్ని బహుకరించారు.ఈ సందర్భంగా వారిని అలియ మర్యాదలతో సత్కరించి స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు.

## హాస్టల్ భవనాలను తమకు అప్పగించాలంటూ పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

- ఎస్పీ కార్యాలయానికి తాత్కాలికంగా కేటాయించిన భవనాలను తిరిగి ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు లేక ప్రైవేట్ హాస్టళ్లలో ఉండాల్సి వస్తోందని ఆవేదన
- తుమ్మల లవకుమార్, ఏఐఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు




**ఆంధ్రనాడు–రాయచోటి,ఆగస్టు 28:** రాయచోటిలో జిల్లా పోలీసు కార్యాలయానికి తాత్కాలికంగా కేటాయించిన తమ హాస్టల్ భవనాలను తిరిగి పాలిటెక్నిక్ విద్యార్థులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం కళాశాల గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లవకుమార్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది విద్యార్థులు తరగతులను బహిష్కరించి, ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లవకుమార్ మాట్లాడుతూ.. 2022లో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించిన సమయంలో ఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనాలను ప్రభుత్వం తాత్కాలికంగా స్వాధీనం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయం సహా సంబంధిత కార్యాలయాలు మదనపల్లెకు తరలిపోయినందున, ఇకనైనా పాలిటెక్నిక్ విద్యార్థుల హాస్టల్ భవనాలను వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రస్తుతం సుమారు 250 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి సరైన హాస్టల్ వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. హాస్టల్ భవనం అందుబాటులో ఉన్న సమయంలో వివిధ జిల్లాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటూ అదే వసతిగృహంలో ఉండేవారని, వారికి భోజనం, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేవని చెప్పారు. అయితే హాస్టల్ భవనాన్ని ఎస్పీ కార్యాలయానికి కేటాయించిన తర్వాత విద్యార్థులు రాయచోటి పట్టణంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో ఉండాల్సి వస్తోందన్నారు. కళాశాలకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న హాస్టళ్ల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ బస్సులు, ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం టిఫిన్ చేసి కళాశాలకు వచ్చిన విద్యార్థులు మధ్యాహ్న భోజనం కోసం తిరిగి హాస్టల్‌కు వెళ్లే అవకాశం లేక, ఉదయం తీసుకువచ్చిన భోజనాన్నే మధ్యాహ్నం తినాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు లభించకపోవడంతో పలువురు విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లించి ఉండాల్సి వస్తోందని లవకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ కార్యాలయ నిర్వహణ కోసం తాత్కాలికంగా కేటాయించిన పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ భవనాలను తిరిగి విద్యార్థులకు అప్పగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దీనివల్ల వివిధ జిల్లాల నుంచి రాయచోటికి వచ్చి విద్యనభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. హాస్టల్ భవనాలను విద్యార్థులకు అప్పగించే వరకు ఏఐఎస్‌పీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని లవకుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు ఏఐఎస్‌పీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## తొలిసారి నియోజకవర్గ పర్యటనకు శంకర్ యాదవ్

**- ఆరు మండలాల్లో టీడీపీ జెండా ఆవిష్కరణలు**



**ఆంధ్రనాడు–కురబలకోట, ఆగస్టు 28:** తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ ఈ నెల 30న తొలిసారిగా నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా చేపడుతున్న ఈ పర్యటనలో భాగంగా ఆరు మండలాల్లో టీడీపీ జెండాలను ఆవిష్కరించి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు.

**పర్యటన వివరాలు ఇలా..**

బి.కొత్తకోట: ఉదయం 10 గంటలకు బీసీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. 10.30 గంటలకు జ్యోతి బస్టాండ్ వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరిస్తారు.

**పీటీఎం:** ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య మండల కేంద్రంలో నిర్వహించే టీడీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు.

**మొలకలచెరువు:** మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట మధ్య మూడు రోడ్ల కూడలి వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరిస్తారు.

**తంబళ్లపల్లె:** మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల మధ్య మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జెండాను ఆవిష్కరిస్తారు.

**పెద్దమండ్యం:** మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు.

**కురబలకోట:** సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య అంగళ్లు మూడు రోడ్ల సర్కిల్ వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరిస్తారు.ఆరు మండలాల్లో పర్యటనను ముగించుకున్న అనంతరం శంకర్ యాదవ్ మదనపల్లిలోని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ కార్యాలయానికి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్డీయే కూటమి నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ కార్యాలయం పిలుపునిచ్చింది.

## వీరభద్రేశ్వర స్వామి పూజకు ఈబీజీ గోవింద్ గౌడ్‌కు ఆహ్వానం



**ఆంధ్రనాడు – పెద్దహ్యాట ఆగస్టు 28 :** పెద్దహ్యాట గ్రామంలో ఈ నెల 31న నిర్వహించనున్న శ్రీ వీరభద్రేశ్వర స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఈబీజీ గోవింద్ గౌడ్‌ను గ్రామస్తులు, ఆలయ అర్చకులు కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఈబీజీ గోవింద్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు,సంప్రదాయాకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని తెలిపారు. తన శక్తి మేరకు గ్రామ ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పంపయ స్వామి, మలయ్య, వీరేష్, రాము, తిరుపతి, బసవ, రామతో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి బోరు ప్రారంభించిన నాయకులు, అధికారులు



**కురబలకోట – ఆంధ్రనాడు, ఆగస్టు 28:** మండలంలోని కనసానివారిపల్లి పంచాయతీ పరిధిలోని బుడ్డారెడ్డిగారి పల్లి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును శుక్రవారం టీడీపీ నాయకులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటిని వినియోగించుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు రోజురోజుకూ గణనీయంగా తగ్గిపోతోందని, ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, జంగా ఎల్లారెడ్డి, జంగా రాఘవ, రెడ్డి గడ్డం నంసింహులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## వైష్ణవి దేవి ఆలయంలో రాఖీ సందర్భంగా ప్రత్యేక పూజలు



**ఆంధ్రనాడు – చౌడేపల్లి, ఆగస్టు 28 :** మండల పరిధిలోని పుదీ పట్ల గ్రామంలో వెలసి ఉండు స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో శ్రావణమాసం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకరాలు శ్రావణి ఉదయమే అమ్మవారికి ,అభయాంజనేయ స్వామికి, నాగభైరవ స్వామికి పంచామృత అభిషేకం చేసి అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. చౌడేపల్లి చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

**ఆంధ్రనాడు –తిరుచానూరు, ఆగస్టు 28:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆలపాటి గిరిధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.





# బన్నీ, చెర్రీలకు అరుదైన గుర్తింపు

టాలీవుడ్‌కు చెందిన స్టార్ హీరోలుఅల్లు అర్జున్ రామ్‌చరణ జాతీయ స్థాయిలో సత్తాచాటారు. భారతదేశంలోని టాప్ 100 ప్రముఖ సెలబ్రిటీలతో 'ఫోర్బ్స్ ఇండియా' రూపొందించిన ప్రతిష్ఠాత్మకమైన 'షో స్టాపర్స్ 2026' జాబితాలో వీరిద్దరూ చోటు దక్కించుకున్నారు. దేశవ్యాప్తంగా వినోదం, క్రీడలు, పాపులర్ కల్చర్‌కు చెందిన 100 మంది సెలబ్రిటీలతో రూపొందించిన ఈ జాబితాలో తెలుగు చిత్రపరిశ్రమ నుంచి వీరిద్దరే ఉండడం విశేషం.అంతేకాదు, తాజా 'షో స్టాపర్స్ 2026' ఎడిషన్ కవర్‌పై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తనదైన స్టైల్లో మెరిశారు. 'పుష్ప' ఫ్రాంచైజీతో ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ఉన్న అల్లు అర్జున్ క్రేజ్.. ఇప్పుడు 'ఫోర్బ్స్ ఇండియా' కవర్ పేజీ రూపంలో తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన స్టార్ ఇమేజ్ నుంచి జాతీయ స్థాయి స్టార్‌గా ఎదిగారు. మరోవైపు గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ కూడా తాజా షోస్టాపర్స్ జాబితాలో స్థానం సంపాదించారు.'ఆర్ఆర్ఆర్' సినిమాతో అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్న రామ్‌చరణ్.. తెలుగు సినిమాకు ప్రపంచవ్యాప్తంగా వచ్చిన క్రేజ్‌లో కీలక పాత్ర పోషించారు. పాన్ ఇండియా సినిమాల హవా కొనసాగుతున్న వేళ.. టాలీవుడ్ నుంచి ఇద్దరు అగ్ర కథానాయకులకు దేశంలోని అత్యంత ప్రభావశీల సెలబ్రిటీల జాబితాలో చోటు దక్కడం తెలుగు సినిమా స్థాయిని మరోసారి చాటిచెప్పినట్టయింది.

**బాలీవుడ్, సౌత్ స్టార్లకూ చోటు..**

ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 జాబితాలో ఉత్తరాది, దక్షిణాది నటీనటులకు కూడా చోటు దక్కింది. బాలీవుడ్ నుంచి షారుఖ్‌ఖాన్, ప్రియాంక చోప్రా జోనస్, రణ్‌వీర్ సింగ్ వంటి ప్రముఖులు చోటు దక్కించుకున్నారు. దక్షిణాది నుంచి రజనీకాంత్, కమల్‌హాసన్, దళపతి విజయ్, మోహన్‌లాల్, మమ్ముట్టి వంటి అగ్ర తారలు కూడా షోస్టాపర్స్‌గా నిలిచారు.

# 'రంభ ఊర్వశి మేనక'.. థియేటర్లలో వేడుక




అల్లరి నరేశ్ ఫాంటసీ కామెడీ 'రంభ ఊర్వశి మేనక'(ఞఎష్ఞు, ఖతీఋంష్త్రఱ, వీవఋఎఖ)తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించారు. ఇందులో సురభి, రాశిసింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ హీరోయిన్లుగా నటించగా, వెన్నెల కిషోర్, నరేశ్ వీకే, శ్రీనివాస్‌రెడ్డి, రచ్చ రవి, మురళీధర్‌గౌడ్ ఇతర ముఖ్యపాత్రలను పోషించారు.ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గురువారం టైటిల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. 'రంభ ఊర్వశి మేనక.. స్టెప్ వేస్తే తెల్లార్లూ వేడుక..' అంటూ సాగుతున్న ఈ పాట సంగీతప్రియుల్లో జోష్ నింపుతోంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.. "ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ఇది చాలా డిఫరెంట్. చాలా కొత్తగా, మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది.ఈ సినిమా కోసం ఆహార నియమాలు చాలా కఠినంగా పాటించాను. షూటింగ్ కూడా మాకు చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది" అని తెలిపింది. ప్రిశా సింగ్ మాట్లాడుతూ.. "ఈ సాంగ్‌కు అందరూ డాన్స్ చేస్తారు. ప్రతి ఒక్కరికీ ఈ పాట నచ్చుతుంది. సెప్టెంబర్ 4న అందరూ ఈ సినిమాని థియేటర్లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా" అని చెప్పింది.విష్ణుప్రియ మాట్లాడుతూ.. "థియేటర్‌లో ఈ పాట అందరినీ సీట్లో నుంచి లేచి డాన్స్ చేసేలా చేస్తుంది. ఇప్పటివరకు రంభ, ఊర్వశి, మేనకలు ఒక డాన్స్‌కో, సన్నివేశానికో రావడం చూశాం. కానీ ఈ కథ మాత్రం చుట్టూ రంభ, ఊర్వశి, మేనకల చుట్టూనే తిరుగుతుంది.



# అద్భుతంగా ఆడారు




కొలంబో, ఆగస్టు 28 : వరల్ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే తప్ప క గెలవాల్సిన శ్రీలంక సిరీస్‌లో భారత్ 1–0 తో విజయం సాధించింది. అయితే 2–0తో సిరీస్ గెలిచే అవకాశం లంక అద్భుత పోరాటంతో చేజారిపోయింది. ఈ నేపథ్యంలో భా రత్ వ్యూహాలపై విమర్శలు వచ్చాయి. హెడ్ కోచ్ గౌతం గంభీర్ మాత్రం తన వ్యూహాల ను పరోక్షంగా సమర్థించుకున్నాడు. భారత్ ఆటగాళ్లు అద్భుతంగా ఆడారని ప్రశంసించా డు. ఈ విజయంపై స్పందిస్తూ ట్వీట్ చేశా డు. టెస్ట్ క్రికెట్‌కు క్యారెక్టర్, సహనం, మానసిక దృఢత్వం చాలా అవసరమని, మన ఆటగాళ్లు చివరి వరకు పోరాడి అదే నిరూపించారని అన్నారు.రెండో టెస్టులో అద్భుత మైన బ్యాటింగ్‌తో మ్యా చ్‌ను డ్రా చేసిన శ్రీ లంక ఆటగాడు సోనాల్ దినుషాను ప్రత్యేకంగా అభినందించాడు. తొలి టెస్టులో భా రత్ ఘనవిజయం సాధించగా, రెండో టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1–0తో గెలుచుకుంది. ఈ సిరీస్ ఫలితం తర్వాత డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చింది.కాగా కొలంబో టెస్టులో ఫాలో ఆన్ వ్యూహం బెడిసికొట్టిందన్న విమర్శలపై మాత్రం గంభీర్ నేరుగా స్పందించలేదు. టెస్టుల్లో పరిస్థితులకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకుంటామని, ఒక్కోసారి ఫలితాలు అనుకూలంగా రాకపోవచ్చంటూ వ్యాఖ్యానించాడు. హెడ్ కోచ్‌గా గంభీర్ వ్యూహాలపై మొదటి నుంచీ విమర్శ లు వస్తున్నాయి. ముఖ్యంగా స్వదేశంలో భారత జట్టు ఎదుర్కొన్న ఘోర పరాజయా లు గంభీర్ కోచింగ్ శైలిని ప్రశ్నార్థకం చేశాయి.గంభీర్ హయాంలోనే టీమిండియా స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో (0–3), దక్షిణాఫ్రికా చేతిలో (0–2) ఘోరమైన టెస్ట్ సిరీస్ ఓ టములను చవిచూసింది. ఒకే కోచ్ హ యాంలో స్వదేశంలో రెండు టెస్ట్ సిరీస్‌ల్లో వైట్‌వాష్ కావడం భారత క్రికెట్ చరిత్రలోనే ఇదే తొలిసారి. శ్రీలంకతో జరిగిన తాజా సిరీస్‌లో రెండో టెస్ట్ మ్యాచ్ ప్రతికూలంగా ముగిసినప్పుడు గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌కు రాకుండా ముఖం చాటేశారని, కేవలం గెలిచినప్పుడు మాత్రమే ప్రగల్భాలు పలుకు తారని మాజీలు విమర్శలు గుప్పించారు.







# ఆసియా క్రీడలకు ద్వితీయ శ్రేణి జట్టు

**ముంబై :** ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల కోసం కౌంట్ డౌన్ మొదలయింది. వచ్చే నెలలో జపాన్ వేదికగా ఈ క్రీడలు జరగనున్నాయి. అయితే ఈ క్రీడల కోసం క్రికెట్ జట్టును పంపించే విషయంలో బీసీసీఐ పునరాలోచనలో పడింది. ఈ టోర్నీకి ద్వితీయ శ్రేణి జట్టును పంపేందుకు బీసీసీఐ సిద్ధమైనట్లు సమాచారం.జపాన్‌లో సరైన క్రికెట్ మైదానాలు లేకపోవడం, వాష్ రూ మ్స్, డ్రెస్సింగ్ రూమ్స్ అధ్వానంగా ఉండడమే దీనికి కారణం. అయితే ఇప్పటికే ఈ టోర్నీలో ఆడే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జపాన్‌లోని ఐచి నగోయా క్రికెట్ మ్యాచ్‌లు ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే అక్కడ సరైన ఏ ర్పాట్లు చేయలేదని తెలుస్తోంది. జపాన్‌లోని వసతులపై బీసీసీఐతో పాటు ఆసియా క్రికెట్ కౌన్సిల్ కూడా అసంతృప్తిగా ఉందని బో ర్డు వర్గాలు తెలిపాయి.బీసీసీఐతో పాటు ఆసియా క్రికెట్ కౌన్సిల్ సైతం జపాన్‌లోని సదుపాయాలపై అసంతృప్తిగా ఉన్నాయనీ, అందుకే అక్కడికి అబ్జర్వర్‌ను పంపించాలనుకుంటున్నాయనీ బోర్డు వర్గాలు తెలిపాయి.. అబ్జర్వర్ నివేదికను బట్టి జట్టు మార్పు విషయంలో బీసీసీఐ నిర్ణయం తీసుకుంటుం దనీ వెల్లడించాయి. బీసీసీఐతో పాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కూడా జపాన్‌లోని వసతులపై ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఐసీసీ రూల్స్ ప్రకారం.. ఒక మ్యాచ్‌ను కనీసం 2 వేల మంది ప్రేక్షకులు అయినా వీక్షించేలా స్టేడియం ఉండాలి. కానీ జపాన్‌లో అలాంటి పరిస్థితి లేద ని తెలుస్తోంది.

# పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యం

## -విశ్వం స్కూల్లో అపూస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమావేశం




**ఆంధ్రనాడు -తిరుపతి,ఆగస్టు 28:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, చిన్న వయస్సు నుంచే వారిని వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడంతో పాటు, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో అపూస్మా ఆధ్వర్యంలో తిరుపతిలోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, తార్కిక ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకత, నూతన విద్యా విధానాలకు అనుగుణంగా పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అపూస్మా ఆధ్వర్యంలో ఈ–అభ్యాస్ అకాడమీ నిర్వహించనున్న 5వ అమ్మ షాట్ ఒలంపియాడ్ , అలాగే విశ్వం ఎడ్యుటెక్ -- అపూస్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్పెల్ బి ప్రతిభా పరీక్షకు సంబంధించిన బ్రోచర్లను అపూస్మా రాష్ట్ర అధ్యక్షులు తులసీ విష్ణు ప్రసాద్ మరియు అపూస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల చైర్మన్ డా॥ ఎన్. విశ్వనాథ్ రెడ్డి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి, వారికి సరైన వేదికను కల్పించడం ద్వారా పోటీ ప్రపంచంలో రాణించేలా తీర్చిదిద్దడం అవసరమన్నారు. అమ్మ చాట్ స్పెల్ బి వంటి ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించడంతో పాటు, వారి విద్యా నైపుణ్యాలు, తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మకత మరియు ప్రతిభను అంచనా వేసేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులను ఈ ప్రతిభా పరీక్షల్లో భాగస్వాములను చేసి, వారి సామర్థ్యాలను చిన్న వయస్సులోనే గుర్తించి, భవిష్యత్‌లో జాతీయ స్థాయి విద్యా మరియు పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా పాఠశాలలను తీర్చిదిద్దడం, విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని పెంపొందించడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. విద్యార్థుల ప్రతిభకు పరీక్ష... భవిష్యత్ విజయానికి బాట అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఆయుష్మా స్పెల్ బి ప్రతిభా పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో అపూస్మా రాష్ట్ర నాయకులు కే.ఎస్. వాసు, డా॥ టి. వెంకటేశ్వర్లు, బి. రవీంద్ర రెడ్డి, ఓబుల వెంకటరమణ రెడ్డి, ఎస్. ఎం . భాషా, టి. రామకృష్ణ రెడ్డి, జయరామి రెడ్డి, సురేంద్ర రెడ్డి, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయం కోసం డీకేటి భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం

## - ప్రభుత్వ ఆదేశాలు హర్ష వ్యక్తం చేస్తున్న రైతులు





**ఆంధ్రనాడు - రామకుప్పం, ఆగస్టు 28**

రామకుప్పం మండలంలో విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులు నష్టపరిహారం రాక ఇబ్బందులు పడేవారు గతంలో ఒకరి నుంచి ఒకరు డికె డి భూములు కొనుగోలు చేశారు దానిని వ్యవసాయంగా చేస్తున్నారు ఇటీవల ఆ భూములను విమానాశ్రయం కోసం భూముల సేకరణ చేశారు తమకు నష్టపరిహారం రాలేదని బాధిత రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి స్థానిక నాయకులకు విన్నవించారు దానితో ప్రభుత్వం అటువంటి డీకే టి భూములకు రైతులకు ఎకరాకు 12,44 లక్షలు చెల్లించేందుకు ఆదేశాలు ప్రత్యేకంగా జారీ చేసింది వేరే ఇతర అంశాలకు ఇది వర్తించదని ఆదేశాలలో పేర్కొన్నారు దీనికోసం విజలాపురం ఖిలాకిపాడు వంక చేలు గ్రామాలలో రైతులతో రెవిన్యూ అధికారులు ప్రజాప్రతినిధులు ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి వివరాలు సేకరించారు విమానాశ్రయం కోసం కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ కార్యక్రమం గురించి చురుకుగా కొనసాగుతున్నది విమానాశ్రయం కోసం సేకరించిన భూములలో సుమారు 70 ఎకరాలు ఒకే వ్యక్తి పేర్ల ఉన్నట్టు సమాచారం దానిని ఏ విధంగా చేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు దానిని కొందరు వ్యక్తులు వినాభి పేరు మీద రాసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు.

దీనిపై అధికారులు నిజానిజాలు వెల్లడిచేసిన అవసరం ఉన్నది ఈ కార్యక్రమంలో కడ అడిషనల్ పిడి శ్రీనివాసరాజు రామ కుప్పం తాసిల్దార్ కౌలేష్ డిప్యూటీ తాసిల్దార్ బాలాజీ రావు, రామ కుప్పం మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ మాజీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి విఆర్వోలు రైతులుపాల్గొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ బాధల్లో విని తమకు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు రావడం పట్ల వారు ధన్యవాదాలు తెలియజేశారు

### ఇంస్టాగ్రామ్‌లో పరిచయమైన వారికి..

# ప్రేమ వివాహం చేసిన దళిత నాయకులు..



**ఆంధ్రనాడు - చౌడేపల్లి, ఆగస్టు 28**

ఇద్దరూ మేజర్లు ఇంస్టాగ్రామ్‌లో పరిచయమైనారు అది ప్రేమగా మారింది వారు ఇరువురికి దళిత నాయకులు గుడిలో పెళ్లి చేసిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది పెళ్లి కుమార్తె యమునా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి అన్నమయ్య జిల్లా పీలేరు మండలం గరిని మిట్ట గ్రామపంచాయతీ రాళ్ల మాదిగ పల్లి గ్రామానికి చెందిన డి. చంద్రమోహన్ కుమార్తె డి. యమునా అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం లద్దిగం గ్రామ పంచాయతీ కేంద్రంలో గల దళిత సామాజిక వర్గానికి చెందిన కందూరి హరిబాబు కుమారుడు కందూరి మణికంఠ అను అతనిని గత నాలుగు సంవత్సరాలుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో యమునా వారి తల్లిదండ్రులకు తెలియ కుండా తన పుట్టినిల్లు నుండి ల దిగం గ్రామానికి వచ్చి ఉన్నది ఇది గమనించిన ఆమె తల్లిదండ్రులు, అక్క బావ లద్దిగం గ్రామానికి వచ్చి వారి ఇంటిలో గల యము నాను కొట్టి, జుట్టు పట్టుకొని ఈడ్చి, కాళ్లతో తన్ని వారి వెంట తీసుకెళ్లారు అయితే ఆమె మరలా తిరిగి లద్దిగం గ్రామములోని మణికంఠ ఇంటికి వచ్చేసింది. ఈ విషయమై చౌడేపల్లి మండల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి తల్లిదండ్రులు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. యమునా తల్లిదండ్రులు ఆమెను తమవెంట తీసుకొని వెళ్లి తనకు ఇష్టం లేని వేరే అతనికి ఇచ్చివివాహం చేయడానికి ప్రయత్నించగా నేను మీ వెంటరాను నేను ప్రేమించిన మణికంఠనే పెళ్లి చేసుకుంటానని మొరాయించింది. నాకు, మణికంఠకు నా తల్లిదండ్రులు మా అక్క, బావల వలన ప్రాణహాని కలదని మాకు రక్షణ కల్పించాలని. చౌడేపల్లి మండల సబ్ ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదు చేసింది.

ఈ క్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం శంకరప్ప సీనియర్ దళిత నాయకుడు ఆశాది కుమార్ వీరి ఆధ్వర్యంలో పుంగనూరు పట్టణంలోని కోనేటి దగ్గర గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రేమికు లకు వివాహం జరిపించారు.

# తల్లిదండ్రులు పిల్లలని ఉన్నతమైన జీవన మార్గంలో నడిపించాలి

**: మంతేన సత్యనారాయణ రాజు**

**తిరుపతిలో పవిత్రత రక్షాబంధన్ కార్యక్రమం**




**ఆంధ్రనాడు - తిరుపతి, ఆగస్టు 28**

ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, తిరుపతి ఆధ్వర్యంలో "పవిత్రత రక్షాబంధన్" కార్యక్రమాన్ని శుక్రవారం మానస సరోవర్ సెంటర్‌లో నిర్వహించారు. రక్షాబంధన్‌ను కేవలం సంప్రదాయంగా కాకుండా పవిత్రత, ఆరోగ్యం, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీకగా నిర్వహిస్తూ, సంపూర్ణ ఆరోగ్యం, సంతోషకరమైన జీవితంపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంతెన సత్యనారాయణ రాజు ఫిజికల్ వెల్నెసస్ పై మాట్లాడుతూ, దీర్ఘకాలం ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించాలంటే సాత్వికమైన, సమతుల ఆహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. పండ్లు, గింజలు వంటి సహజ ఆహారానికి ప్రాధాన్యతనిస్తూ, ఉప్పు, నూనె, అనవసరంగా అధికంగా ఉడికించిన ఆహారాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు, స్వభావం, సంస్కారాలను అందించి ఉన్నతమైన జీవన మార్గంలో నడిపించాలని కోరారు.

**బీకే బాలకిషోర్ భాయ్ జీ మెంటల్** వెల్నెనేస్ పై మాట్లాడుతూ, రాజయోగం ద్వారా ఆత్మ పరమాత్మతో అనుసంధానమై శక్తిని పొందుతుందని, ఆ శక్తిని దైనందిన జీవితంలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకొని ఆనందభరితమైన జీవితాన్ని గడపవచ్చని వివరించారు. "ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు, శక్తివంతమైన ఆత్మ --- సంతోషకరమైన జీవితానికి ఇదే పునాది" అని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు అతిథులు, మహనీయులు, ఆరోగ్యాభి లాషులు, శ్రేయోభిలాషులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కార్యక్రమం ముగింపులో బ్రహ్మకుమారీస్ సంస్థ తిరుపతి నిర్వాహకురాలు లీలా బెహన్‌జీ పవిత్ర రక్షాబంధన్ యొక్క ఆధ్యాత్మిక మహత్వాన్ని వివరిస్తూ, భగవంతుని స్మృతిలో ఆయన శక్తిని ఆధారంగా చేసుకొని పవిత్రమైన జీవితం గడపడానికి ఏర్పరచుకునే పవిత్ర బంధమే రక్షాబంధన్ అని తెలిపారు. అనంతరం విచ్చేసిన శ్రేయోభిలాషులందరికీ రాఖీలు కట్టి, ప్రసాదాన్ని అందజేశారు.

### మ్మెల్సీ నాగబాబును కలిసిన పాల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్



**కార్వేటినగరం - ఆంధ్రనాడు, ఆగస్టు 28:** ఎమ్మెల్సీ నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఎంఎల్ సి నాగబాబు ను రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డైరెక్టర్లు నాగేశ్వరరాజు, డాక్టర్ నాగ సందీప్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు.

# విమానాశ్రయంలో స్పీకర్‌కు ఘన స్వాగతం



**ఆంధ్రనాడు,రేణిగుంట. ఆగస్టు 28:** తిరుపతి విమానాశ్రయంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడి రాక సందర్భంగా తుడా చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి , సీనియర్ నాయకుడు నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు , ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి స్పీకర్ అయ్యన్న పాత్రుడు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా ఘనంగా సత్కరించి, ఆత్మీయంగా స్వాగతం పలికారు . అనంతరం ఇరువురు పరస్పరం అభివాదం చేసుకుని, అభివృద్ధి, ప్రజా సంక్షేమం తదితర అంశాలపై ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదవ కార్పొరేషన్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, తెదేపా తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి జేబీ శ్రీనివాస్, మక్కి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కురుకాలువలో మన ఊరు మన జెండా



**ఆంధ్రనాడు, రేణిగుంట. ఆగస్టు 28 :** రేణిగుంట మండలం కురుకాలువ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మన ఊరు మన జెండా కార్యక్రమాన్ని నిర్వహించారు. రేణిగుంట కుర్రకాల్వ గ్రామంలో మన ఊరు మన జెండా" బహిరంగ సభ? ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన మన ఊరు – మన జెండా ప్రచారంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించారు. రేణిగుంట బీజేపీ నాయకుడు కుర్రకాల్వ వేణు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ మరియు టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వికసిత్ భారత్ లక్ష్యాలను ప్రతి ఇంటా ప్రచారం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని, గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామీణాభివృద్ధికి బీజేపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కోలా ఆనంద్ పేర్కొనగా, సభను విజయవంతం చేసినందుకు కుర్రకాల్వ వేణు ముదిరాజ్ గ్రామీణులకు మరియు పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీడీ బాలాజీ, కుర్రకాల్వ వేణు ముదిరాజ్, రాజా రాయల్, నరేష్ రాయల్, ప్రేమ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, భాస్కర్, ఇతర స్థానిక నేతలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు విత్తనాలు విరాళం

## - అభినందించిన జిల్లా కలెక్టర్




**ఆంధ్రనాడు- రామకుప్పం, ఆగస్టు 28**

పర్యావరణ పరిరక్షణ గ్లోబల్ వార్మింగ్ నివారణ కోసం యోగా గురువు వెంకటేశం అటవీ శాఖ అధికారులకు 1,18 లచ్చల విత్తనాలను క్రిష్ణగిరి కలెక్టర్ కు స్వచ్ఛందంగా అందజేశారు దీనిని అటవీ ప్రాంతం ఇతర ప్రభుత్వ నిరుపయోగ స్థలాల్లో వీటిని ఉపయోగించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమాన్ని సహకరించినందుకు అతనికి స్థానిక ప్రజలు కూడా ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అతనిని అభినందించి అభినందన పత్రం అందజేశారు

# స్వర్ణాంధ్ర లక్ష్యాలే ప్రాధాన్యం

## - నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష

**ఆంధ్రనాడు -తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 28:** స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో నియోజకవర్గ స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల ఏర్పాటు ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా శుక్రవారం సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఇతర అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల పురోగతి, పి4, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపిఐలు), పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (పీపీపీ) అంశాలపై సమీక్షించారు. గత ఏడాది కాలంలో యాక్షన్ ప్లాన్ యూనిట్లు చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని సీఎం పరిశీలించారు. వివిధ నియోజకవర్గాల్లో అమలు చేసిన ఉత్తమ విధానాలు, వినూత్న కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులతో చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామని సీఎం తెలిపారు. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, యంగ్ ప్రొఫెషనల్స్, విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సభ్యులు సమన్వయంతో పనిచేసి తమ నియోజకవర్గాలను అభివృద్ధి, పనితీరులో ముందంజలో నిలపాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌తో పాటు జేసీ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులు, సీపీవో, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆగస్టు 30న జిల్లాకు సీఎం చంద్రబాబు

## - శ్రీకాళహస్తిలో పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష




**ఆంధ్రనాడు -తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 28:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 30న తిరుపతి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలిసి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. శ్రీకాళహస్తి సీసీఎన్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే వివాహ కార్యక్రమానికి సీఎం హాజరుకానున్న నేపథ్యంలో ఎంజీఎం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కన్వెన్షన్ హాల్ వరకు భద్రత, ట్రాఫిక్, పారిశుధ్య ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వీఐపీ, వీవీఐపీ, అతిథుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. అడ్వాన్స్‌డ్ అంబులెన్స్‌లు, జనరేటర్లు, ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి భద్రతా లోపాలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు సూచించారు. హెలిప్యాడ్ ల్యాండింగ్, టేకాఫ్ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు డాగ్ స్క్వాడ్‌లతో ఏరియా డామినేషన్, రాత్రివేళల్లో పటిష్ట బందోబస్తు చేపట్టాలని ఆదేశించారు. సీఎం ప్రయాణించే మార్గాల్లో రూట్ బందోబస్తు ఏర్పాటు చేసి, అవసరమైన తనిఖీలు, క్లియరెన్స్ ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, అదనపు ఎస్పీలు రామకృష్ణ, శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ బాలకృష్ణనాయక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, జిల్లా రవాణా అధికారి మురళీమోహన్, తొట్టంబేడు తహశీల్దార్ భారతి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, భద్రతా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# భాష్యం-2 పాఠశాలలో ఘనంగా రాఖీ పండుగ



**ఆంధ్రనాడు - ఆదోని, ఆగస్టు 28:** ఆదోని పట్టణంలోని భాష్యం-2 పాఠశాలలో చైర్మన్ రామకృష్ణ, మాచని కవిత జెడిఓ ఆధ్వర్యంలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ సోదరులకు రాఖీలు కట్టి, సోదర--సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రవిప్రకాష్ మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు రక్షాబంధనం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. రాఖీ కట్టి సోదరుల రక్షణను కోరుతూ, వారి శ్రేయస్సును ఆకాంక్షించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందిస్తూ ప్రేమాభిమానాలను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ అంజి, హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కె.వి.పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**ఆంధ్రనాడు--కె.వి.పల్లి,ఆగస్టు 28:** కె.వి.పల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అవలంబించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి పల్లెనిద్ర కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది యోగక్షేమాలను ఎస్పీ ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కలకడ సీఐ బి. లక్ష్మన్న, ఎస్ఐ శివకుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నాగబాబుకు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలి

## - జనసేన ఇన్‌చార్జ్ వాల్మీకి బి. లక్ష్మన్న ఆకాంక్ష



**ఆంధ్రనాడు - ఆదోని, ఆగస్టు 28:** మంగళగిరిలోని అరణ్య భవన్‌లో కొణిదల నాగబాబు చైర్మన్ (క్యాబినెట్ ర్యాంక్) హోదాలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మంత్రాలయం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వాల్మీకి బి. లక్ష్మన్న ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ రాఘవేంద్ర స్వామి ఆశీస్సులతో నాగబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని కోరుకున్నారు.

# ప్రజలకు మంచి జరగాలి..

## - డీఐ రోడ్డులో వినాయక మండపానికి పూజ చేసిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**ఆంధ్రనాడు–చిత్తూరు ఆగస్టు 28 :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా విఘ్నాలన్ని తొలగి ప్రజలందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గణపతిని ప్రార్థించారు. చిత్తూరు డీఐ రోడ్డులో ఏర్పాటు చేసే గణపతి విగ్రహానికి సంబంధించి మండపం నిర్మాణాన్ని శుక్రవారం ఉదయం తిరుమల బేకరి అదినేత కన్నపన్ ఆయన తనయుడు దీపక్, శివశక్తి వినాయక భక్తులతో కలసి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం నిర్వహిస్తున్న వినా యక చవితి యాబైయోవ సంవత్సరము నీ పురస్కరించుకొని డీఐ రోడ్డు వినాయక ఉత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లను నిర్వాహక కమిటీ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ చైర్మన్ కన్నపన్, దీపక్ మాట్లాడుతూ పంతొమిదివందల డెబ్బయి ఆరు నుంచి రెండువేల ఇరవయి ఆరు వరకు ఇది యబైయోవ సంవత్సరం కనుక భారీగా వెయిన్ని ఐదువందల పదహారు కిలోల లడ్డును ప్రత్యేకంగా తయారు చేసి ఊరేగింపుగా వినాయక మండపానికి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్, సమస్యలు తలెత్తకుండా ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పందిరి కార్యక్రమమని ప్రారంభించారు.

# వెల్లువెత్తిన "రాఖీ" బంధం..

## - ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌కు రాఖీలు కట్టిన అక్కచెల్లెలు..

## - చిరు కానుకలు అందించిన ఎమ్మెల్యే..



**ఆంధ్రనాడు–చిత్తూరు, ఆగస్టు 28 :** రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజా దర్బార్ అక్కచెల్లెమ్మలతో కిక్కిరిసింది. వెల్లువెత్తిన ఆత్మీయతతో మహిళలు, తెలుగు దేశం పార్టీ, కూటమి పార్టీల మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌కి రాఖీలు కట్టారు. అక్క చెల్లెమ్మలు కట్టిన రాఖీలతో ఎమ్మెల్యే గారి రెండు చేతులు నిండిపోయాయి. ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టిన అక్క చెల్లెమ్మలకు.. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, సతీమణి కంచెర్ల ప్రతిమ పసుపు, కుంకుమ, చీర, మిఠాయిలు అందించారు. చెల్లెమ్మలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733